సాక్షి చిత్తూరు

శుక్రవారం । 18 । ఏప్రిల్ । 2025



సిండికేట్.. అ'ధర'హో!

హెచరీల సిండికేట్‌తో చికెన్ ధర కొండెక్కి కూర్చుంది. ప్రాంతం, సీజన్‌ల వారీగా రేట్లు పెంచుతున్నాయి.

- 10లో



అక్రమాలపై విచారణ

స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అక్రమాలపై గురువారం చిత్తూరులో ఆర్‌ఐపీ పలువురిని విచారణ జరిపారు.

- 10లో



పంటకు రక్ష.. భక్షకులకు శిక్ష

ఓ రైతు వినూత్న ఆలోచనతో పంటకు రక్షణ కలగగా, దాన్ని తినివేయడానికి వచ్చే పక్షులు, వానరాలకు శిక్షగా మారింది.

- 10లో

న్యూస్‌రీల్

ఆర్టీసీలో టెండర్ల ఆహ్వానం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు జిల్లాలోని ఆర్టీసీ పరిధిలో ఉన్న వివిధ షాపుల నిర్వహణకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డీపీటీఓ జితేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 24వ తేదీ లోపు ఆయా డిపోల పరిధిలో టెండర్లు దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. చిత్తూరు నగరం ఆర్టీసీ బస్టాండ్‌లోని డీపీటీఓ కార్యాలయంలో 25వ తేదీ టెండర్ల ప్రక్రియ జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు www.aprrtc.ap.gov.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

ఒకటో తరగతిలో అడ్మిషన్లకు ఆన్‌లైన్ దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం ప్రకారం ఒకటో తరగతిలో అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ వరలక్ష్మి తెలిపారు. గురువారం డీఈఓ విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 2025-26 విద్యాసంవత్సరంలో ఒకటో తరగతి అడ్మిషన్లకు ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఐబీ, ఐసీఎస్‌ఈ, సీబీఎస్‌ఈ, స్టేట్ సిలబస్‌లు అమలు చేయాలన్నారు. ఆయా యాజమాన్యాల్లో ఒకటో తరగతిలో విద్యనభ్యసించేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 28 నుంచి మే 15వ తేదీలోపు www.cre.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని డీఈఓ కోరారు.

వెబ్‌సైట్‌లో ఏకీకృత సీనియారిటీ జాబితా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్‌అసిస్టెంట్ల ఏకీకృత సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీఈఓ వరలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. స్కూల్ అసిస్టెంట్ కేడర్ నుంచి హెచ్‌ఎం కేడర్ ఉద్యోగోన్నతికి మెరిట్ ప్రకారం సిద్ధం చేసిన ఏకీకృత సీనియారిటీ జాబితాను ఈ నెల 17వ తేదీన విడుదల చేశామన్నారు. ఈ జాబితాను స్కూల్ అసిస్టెంట్లు సరి చూసుకోవాలన్నారు. ఏవైనా అభ్యంతరాలున్నట్లయితే తగు ఆధారాలతో ఈ నెల 20 వ తేదీ లోపు డీఈఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. గడువు తేదీ తర్వాత వచ్చే అభ్యంతరాలను స్వీకరించబడవని డీఈఓ వెల్లడించారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 13 కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ టీబీసీ వద్దకు చేరింది. బుధవారం అర్ధరాత్రి వరకు 70,372 మంది స్వామివారిని దర్శించుకోగా 24,463 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.25 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

శ్రీవారికి నాణ్యమైన సేవలు

తిరుపతి కల్చరల్: శ్రీవారి భక్తుల సేవ నిరంతరం అని, మరింత నాణ్యమైన సేవలు అందిస్తూ శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని ఏపీ శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ వేగుల్ల జోగేశ్వరరావు సూచించారు. పద్మావతి అతిథి గృహంలో గురువారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి ఏపీ అసెంబ్లీ అంచనాల కమిటీ చైర్మన్, సభ్యులు, టీటీడీ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జోగేశ్వరరావు మాట్లాడుతూ అంచనాల కమిటీ చేసిన పలు సూచనలను పరిగణనలోకి తీసుకుని మరింత నాణ్యంగా సేవలు అందించాలన్నారు. వసతి గదుల నిర్వహణపై నిత్యం పర్యవేక్షణ ఉండాలని సభ్యులు సూచించారు. స్వామివారి కీర్తనలు, గోవిందనామావళిని రాత్రి 10 గంటల వరకు వినిపించేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. టీటీడీ ఈఓ శ్యామలరావు సమాధానం ఇస్తూ ఇప్పటికే ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. తిరుమలలో అందిస్తున్న సేవలపై శాఖల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా టీటీడీ అదనపు ఈవో సీహెచ్.వెంకయ్య చౌదరి, ఏపీ అంచనాల కమిటీ సభ్యులకు వివరించారు. ఏపీ అంచనాల కమిటీ సభ్యులు భూమా అఖిలప్రియ, నిమ్మక జయకృష్ణ, వెంకటరాజు టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం పాల్గొన్నారు.

కూటమి నేతలు కపట నాటకాలకు తెరదీశారు. జరిగిన తప్పుని సరిదిద్దాల్సింది పోయి బుకాయింపులకు దిగారు. టీటీడీ గోశాలలో గోవుల మృత్యుఘోషను ప్రపంచానికి వినిపించకుండా.. కళేబరాలు కనిపించకుండా చేయాలని విశ్వ ప్రయత్నాలు చేశారు. చివరకు సవాల్ విసిరి నిజాలు నిగ్గుతేలుతాయని భయపడిపోయారు. పోలీసులను రంగంలోకి దింపి ఎక్కడికక్కడ అడ్డుకుంటూ చెలరేగిపోయారు. వీరి నాటకాలు చూసిన జనాలు ఔరా..? అంటూ ముక్కున వేలేసుకున్నారు. గోసంరక్షణను గాలికొదిలేసి ఇలా బరితెగించడం ఎంతవరకు కరెక్ట్ అని ఎదురుదాడికి దిగారు. ఈ ఘటన గురువారం తిరుపతిలో చర్చనీయాంశంగా మారింది.

నిర్బంధం నిగ్గుతేలని నిజం

గోశాలకు వెళ్లకుండా భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఇతర నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు (ఇన్‌సెట్) ఎంపీ గురుమూర్తితో కూటమి నేతల వాగ్వాదం







ఎంపీ గురుమూర్తిని గోశాల నుంచి బయటకు పంపేస్తున్న ఎస్పీ, అడిషనల్ ఎస్పీ

టీటీడీ గోశాల ఘటనపై హైడ్రామా

- సవాల్ విసిరి స్వీకరించకుండా అడ్డగింపులు
- వైఎస్సార్‌సీపీ నేతలు వెళ్లకుండా పోలీసుల నిర్బంధం
- నిజాలు నిగ్గుతేలకుండా ఇదేం పని అంటున్న స్థానికులు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: టీటీడీ గోశాలలో గోవుల మృతిపై లెక్కతేలకుండా కూటమి నేతలు అడ్డుకట్టకు యత్నించారు. తప్పులు కప్పిపుచ్చేందుకు అధికార మదంతో రెచ్చిపోయారు. కుట్రపూరితంగా సవాల్ విసిరి రెచ్చగొట్టారు. ఆపై పోలీసులను రంగంలోకి దింపి వైఎస్సార్‌సీపీ నాయకులు గోశాలకు వెళ్లకుండా నిర్బంధకాండకు పూనుకున్నారు. ఈ ఘటన గురువారం తిరుపతిలో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది.

తప్పుడు ప్రకటనలు..కప్పిపుచ్చే యత్నాలు

టీటీడీ గోశాలలో వరుసగా గోవులు మృత్యువాత పడుతున్నాయంటూ ఇటీవల వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి భూమన కరుణాకరరెడ్డి సంచలన విషయాలు తెరపైకి తెచ్చారు. నాటి నుంచి కూటమి నేతలు ఆ తప్పుని కప్పిపుచ్చేందుకు నానా తంటాలు పడుతున్నారు. మొదట తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ పరస్పర విరుద్ధ ప్రకటనలకు దిగారు. 40 గోవులు మృతి చెందాయని ఒకరంటే.. కాదుకాదు 20 నుంచి 22 గోవులు మాత్రమే మృతి చెందాయని ఇంకొకరు చెప్పుకొచ్చారు. మరో వైపు టీటీడీ ఏకంగా ఈఓ మీడియా సమక్షంలోనే గత మూడు నెలల కాలంలో 43 గోవులు మృతి చెందాయని కుండబద్దలు కొట్టేశారు. మొదటి రోజు గోవులు చనిపోలేదని ప్రకటన చేసి.. మరుసటి రోజు గోవులు మరణించాయని ప్రకటన చేయడాన్ని కూటమి శ్రేణులే తీవ్రంగా తప్పుపడుతున్నారు.



రోడ్డుపై పడుకొని నిరసన తెలుపుతున్న భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి, మాజీ మంత్రి నారాయణస్వామి, భూమన అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, రాజేష్

సవాల్ విసిరి..నిజాలు దాచి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ట్విట్టర్ వేదికగా రెచ్చిపోయారు. టీటీడీ గోశాలలో గోవులు మృతిచెంది ఉంటే నిరూపించాలంటూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి సవాల్ విసిరారు. దీనిపై భూమన కరుణాకరరెడ్డి స్పందించారు. గురువారం ఉదయం 10గంటలకు టీటీడీ గోశాలకు వస్తాను అని ప్రకటన చేయగా.. పల్లా రమ్మని ఆహ్వానించారు. తీరా పల్లా శ్రీనివాసరావు రాకపోగా.. కూటమి నేతలను గుంపుగా గోశాలకి పంపించారు. వైఎస్సార్‌సీపీ నాయకులను గోశాలకు వెళ్లకుండా అడ్డుకట్టకు తెరలేపారు. బుధవారం అర్ధరాత్రి నుంచి కూటమి నేతలు ఆడిన నాటకాలు చూసి స్థానికులు నవ్వుకుంటున్నారు.

ఇదేనా సనాతన ధర్మం

తామే సనాతన ధర్మానికి ప్రతినిధులమని, హిందువులు, గోమాతలంటే భక్తి అని చెప్పుకునే కూటమి నేతలు.. టీటీడీ గోశాలలో ఉన్న పవిత్రమైన శ్రీవేణుగోపాలస్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో చెప్పులు ధరించి తిరిగారు. ఆలయం అరుగుపై చెప్పులతోనే నిల్చొని ఫొటోలకు ఫోజులిచ్చారు. దీనిపై కూటమి శ్రేణులే ఆగ్రహం వ్యక్తం చేస్తుండడం గమనార్హం.



టీటీడీ గోశాలలో టీడీపీ జెండాలతో ఉన్న కార్లు



గోశాలకు వెళ్లకుండా పోలీసుల అడ్డగింపు

నిజాలు నిగ్గుతేల్చేందుకు సిద్ధం

తిరుపతి మంగళం : టీటీడీ గోశాలలో గోవుల మృతిపై టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌రావు విసిరిన సవాల్‌ను తమ పార్టీ జిల్లా అధ్యక్షులు, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి స్వీకరించి గోశాలకు వస్తామంటే పోలీసులచేత అడ్డుకోవడం ఏంటని మాజీ మంత్రులు ధ్వజమెత్తారు. తిరుపతి పద్మావతీపురంలో పార్టీ క్యాంప్ కార్యాలయం నుంచి గురువారం గోశాలకు వెళ్లేందుకు బయలుదేరిన భూమన కరుణాకరరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, నియోజకవర్గ సమన్వయకర్తలు భూమన అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, నూకతోట రాజేష్‌ను పోలీసులచేత ఎందుకు నిర్బంధించారని ప్రశ్నించారు.



నిరసన తెలుపుతున్న నేతలతో పోలీసుల వాగ్వాదం

దమ్ముంటే గోశాలకు అనుమతించాలి

టీడీపీ అధ్యక్షుడు ఎక్కడో కూర్చొని సవాల్ విసరడం కాదని, దమ్ముంటే సవాల్‌ను స్వీకరించిన భూమన కరుణాకరెడ్డిని గోశాలకు పిలిపించుకుని నిజాలు నిగ్గతేల్చాలి. టీటీడీ నిర్లక్ష్యం లేకుంటే మమ్మల్ని ఎందుకు గోశాలకు రానివ్వలేదు. చంద్రబాబుకు అబద్ధాలు చెప్పడం వెన్నతో పెట్టిన విద్య. సనాతన ధర్మ పరిరక్షకుడైన పవన్‌కళ్యాణ్ కూడా టీటీడీలో జరుగుతున్న అపచారాలను ఎందుకు ప్రశ్నించడం లేదు. తప్పులను సరిదిద్దుకోకుండా తిరిగి వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు జగనన్నపై ఎదురుదాడులకు దిగడం సిగ్గుచేటు.

– ఆర్కే.రోజా, మాజీ మంత్రి

స్వామితోనే రాజకీయమా బాబు?

సాక్ష్యాత్తు శ్రీ వేంకటేశ్వరస్వామితో చంద్రబాబు చేసిన రాజకీయం కారణంగానే తిరుమలలో ఇన్ని అపచారాలు జరుగుతున్నాయి. శ్రీవారి లడ్డూలో ఆవు, పంది కొవ్వు కలిసిందని ఆరోపించారు. దీనిపై సుప్రీంకోర్టు చంద్రబాబుకు మొట్టికాయలు వేసింది. అయినప్పటికీ చంద్రబాబుకు బుద్ధి రాలేదు. ఇప్పుడు గోశాలలో గోవులు మృతి చెందితే ఒక్క ఆవు కూడా చనిపోలేదని అబద్ధాలు చెబు తున్నారు.

– కే.నారాయణస్వామి, మాజీ డిప్యూటీ సీఎం

వందకుపైగా గోవులు మృతి

గత పది నెలలుగా టీటీడీ గోశాలలో వందకు పైగా గోవులు మృతి చెందాయి. దీనిపై టీడీపీ అధ్యక్షుడు సవాల్ విసిరి నిజాలు నిగ్గ తేల్చకుండా అడ్డుకోవడం దారుణం. ఆయన సవాల్‌ను తమ నాయకుడు భూమన కరుణాకరరెడ్డి స్వీకరించి గోశాలకు బయలు దేరితే పోలీసులచేత అడ్డుకోవడం ఏంటి?. సవాల్‌ను ఎదుర్కొనే దమ్ములేదా?. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది. తప్పిదాలను సరిదిద్దుకునే పరిస్థితి కనిపించడం లేదు.

– భూమన అభినయ్‌రెడ్డి, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త

హిందువుల మనోభావాలతో ఆటలా?

హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా కూటమి ప్రభుత్వం, టీటీడీ వ్యవహరిస్తోంది. చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు మరిన్ని తప్పులు చేస్తున్నారు తప్ప వాటిని సరిదిద్దుకోవడంలేదు. గోశాలలో గోవుల మృతిపై సీఎం చంద్రబాబుతో పాటు టీటీడీ చైర్మన్, ఈవో, స్థానిక ఎమ్మెల్యేలు వారికి తోచినట్లుగా ప్రకటనలు చేస్తున్నారు. రాజకీయాలు మానుకుని గోశాలలో గోవుల మృతిపై నిజాలు అందరికీ తెలియజేయాలి.

– చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త



మాజీ మంత్రి రోజాను అడ్డుకుంటున్న పోలీసులు



అభినయ్‌ని గోశాల నుంచి బయటకు పంపుతున్న పోలీసులు



వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు



ఎస్వీయూ పోలీస్ స్టేషన్‌లో భూమన అభినయ్, నేతలు

రెవెన్యూ సమస్యలు చిత్తశుద్ధితో పరిష్కరించండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని తహసీల్దార్లు రెవెన్యూ సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో తహసీల్దార్లతో రెవెన్యూ సమస్యల పరిష్కారంపై వర్క్‌షాప్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్లు అధిక ప్రాధాన్యత ఇచ్చి, ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాలని తెలిపారు. మ్యూటేషన్ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలన్నారు.

ఆర్‌ఓఆర్ సమస్యలు అధికం

జిల్లాలోని అన్ని మండలాల్లో ఆర్‌ఓఆర్ సమస్యలు అధికంగా ఉన్నాయని కలెక్టర్ అన్నారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో ఆర్‌ఓఆర్ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు ఆర్డీఓలు అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఆర్డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తమకు కేటాయించిన మండలాల్లో భూ అలినేషన్, అసైన్‌మెంట్ భూమి, రెగ్యులరైజేషన్, ఆర్‌ఓఆర్, వెబ్‌ల్యాండ్, రీ సర్వే సమస్యలను గుర్తించాలన్నారు. వెబ్‌ల్యాండ్‌లో సవరణలు చేసే సమయంలో తహసీల్దార్లు రికార్డులను పరిశీలించడంతోపాటు క్షేత్రస్థాయి పరిశీలన చేసిన అనంతరం చర్యలు చేపట్టాలన్నారు. రీ సర్వే పురోగతికి వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్‌లు తరచూ సమీక్షించాలన్నారు. ఈ వర్క్‌షాప్‌లో జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు, ఆర్డీఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో అర్హత, ఆసక్తి ఉన్న క్రీడాకారులు పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏటా గణతంత్ర్య వేడుకల్లో అత్యున్నతమైన పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డులు అందిస్తుందన్నారు. ఈ అవార్డులకు జిల్లా తరఫున అంతర్జాతీయ క్రీడల్లో అత్యున్నత ప్రతిభ చాటిన క్రీడాకారులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు మే 26వ తేదీ లోపు rportri nap@famai.com మెయిల్ కు దరఖాస్తులు పంపాలన్నారు. వచ్చే దరఖాస్తులను పరిశీలించి కేంద్రప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని ఆయన వెల్లడించారు.

ఆధునిక పద్ధతిలో సాగు చేయండి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రైతులు ఆధునిక పద్ధతిలో పంట సాగు చేసి, లాభాలు ఆర్జించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ అన్నారు. చిత్తూరు నగరంలోని జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో గురువారం వ్యవసాయ రంగంలో డ్రోన్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కిసాన్ డ్రోన్ గూపు కన్వీనర్లు, కో కన్వీనర్లు, అధికారులు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ డ్రోగో టెక్నాలజీస్ డ్రోన్ ధర రూ. 9.80 లక్షలుంటే రాయితీతో రూ.7.84 లక్షలతో అందిస్తారన్నారు. విహజ్ఞ టెక్నాలజీస్ వారి డ్రోన్ ధర రూ.9.81 లక్షలుంటే రాయితీతో రూ.7,84,800కే ఇస్తారన్నారు. రైతులకు దీనిపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి, ఆధునిక పద్ధతుల్లో వ్యవయసాయాన్ని వృద్ధి చేసుకునేలా చూడాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రైబుల్ వెల్ఫేర్ అధికారి హరీష్, ఎల్‌డీఎం హరీష్, డీసీసీబీ సీఈఓ శంకర్‌బాబు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.



డ్రోన్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

క్లుప్తంగా

కారును ఢీకొన్న కంటైనర్



మొగిలి ఘాట్‌లో ప్రమాదానికి గురైన కారు

బంగారుపాళెం: మండలంలోని మొగిలిఘాట్‌లో గురువారం చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై కారును కంటైనర్ ఢీకొంది. దొరచెరువు వద్ద బెంగళూరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న కారును వెనుక నుంచి కంటైనర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు వెనుక భాగం దెబ్బతినింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రహదారిపై ప్రమాదానికి గురైన కారును పక్కకు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కబేళాలకు 30 పశువులు

- పట్టుకున్న పోలీసులు

పుంగనూరు: చట్టవిరుద్ధంగా కబేళాలకు తరలిస్తున్న 30 పశువులను పట్టుకుని, టీటీడీ గోశాలకు తరలించినట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పట్టణ సమీపంలోని రాంపల్లె వద్ద ఓ కంటైనర్‌లో పశువులను తరలిస్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ విషయమై గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పశువులను స్థానిక మార్కెట్ యార్డుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, వాటిని టీటీడీ గోశాలకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాశిరాలలో జాతీయ బృందం పర్యటన

యాదమరి: జలజీవన్ పథకంలో చేసిన పనులను పరిశీలించడానికి ఢిల్లీ నుంచి జాతీయ బృందం మండలంలో పర్యటించింది. గురువారం మండలంలోని కాశిరాల పంచాయతీలో జాతీయ బృందం సభ్యులు ఏడుగురు తాగునీటి ట్యాంకులు, నీటి కొళాయిలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ బృందం సభ్యుడు అన్బుజ్‌గన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ మంచి నీటిని అందించడమే జల్‌జీవన్ మిషన్ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. స్థానిక సచివాలయంలోని జలజీవన్ మిషన్‌కు సంబంధించి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ నీటిపారుదల శాఖ డీఈలు శ్రీనివాసులు, రవికిరణ్, ఏఈ ఉషారాణి, ఈఓపీఆర్డీ సుకుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శిరీష పాల్గొన్నారు.

దొరికితేనే దొంగలు!

- చిత్తూరు కేంద్రంగా నకిలీ పత్రాల దందా
- తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్లు
- బ్యాంకును బురిడీ కొట్టించేందుకు యత్నం
- రెవెన్యూ ఉద్యోగే సూత్రధారి
- అన్ని తెలిసినా రెవెన్యూ అధికారులు మౌనం
- సాక్షి కథనంతో నకిలీ భాగోతంపై కదలికలు
- గుట్టురట్టు చేసిన పోలీసులు



చిత్తూరు అర్బన్/కాణిపాకం: చిత్తూరులో తహసీల్దార్ కార్యాలయ కేంద్రంగా నకిలీ పత్రాల దందా పెచ్చుమీరింది. ఇంటి దొంగలే ఫోర్జరీ గ్యాంగ్‌ను సృష్టించారు. తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్లు.. బ్యాంకును బురిడీ కొట్టించేందుకు యత్నించారు. ఈగ్యాంగ్‌లో రెవెన్యూ ఉద్యోగే కీలక సూత్రధారిగా వ్యవహరించారు. తహసీల్దార్ సీలును దొంగలించారు. ఏకంగా తహసీల్దార్ సంతకాలనే ఫోర్జరీ చేశారు. రూ.కోట్ల విలువ చేసే భూములపై తప్పుడు పత్రాలు సృష్టించారు. దీనిపై సాక్షి దినపత్రిక కథనాలు వండిపెట్టింది. దీంతో ఫోర్జరీ వ్యవహారంపై కదిలికలొచ్చాయి. వెంటపడిన పోలీసులు, ముఠా గుట్టును రట్టు చేశారు. చివరకు ఫోర్జరీ ముఠా కటకటలపాలైంది. వివరాల్లోకి వెళితే.. చిత్తూరు నగరంలోని అర్బన్ తహసీల్దార్‌గా పనిచేసిన కళావతి సంతకం ఫోర్జరీ చేసిన ఓ పత్రం ఈ ఏడాది జనవరిలో వెలుగులోకి వచ్చింది. తిమ్మసముద్రంలోని ఓ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు తప్పుడు ఎంజాయిమెంట్ సర్టిఫికెట్‌తో కూడిన ఓ దరఖాస్తు సబ్ రిజిస్ట్రార్ వద్దకు వెళ్లింది. తహసీల్దార్ సంతకాన్ని అనుమానించిన ఆ రిజిస్ట్రార్ ఆ పత్రాన్ని పరిశీలనలో పెట్టారు. అప్పటి తహసీల్దార్ ఇది తన సంతకం కాదని స్పష్టం చేశారంటూ చిత్తూరు తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ ప్రారంభించిన పోలీసులకు ఆ ఫోర్జరీ లొసుగులు వెలుగులోకి తీసుకొచ్చారు. ఆపై దీనిని బయటకు పొక్కనివ్వకుండా కూటమి నేతలు అడ్డుపడ్డారు.

పోలీసులకు పరీక్షే...

ఫోర్జరీపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఈ తరుణంలో కూటమి నేతల నుంచి అడ్డంకులు వచ్చి పడ్డాయి. దీనిపై జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో కేసు ముందుకు కదిలింది. ఫోర్జరీ గుట్టును రట్టు చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో దొంగిలించిన తహసీల్దార్ సీలు, గ్రీన్ ఇంక్ పెన్ స్వాధీనం చేసుకున్నారు. కాగా ఈ కేసు ఛేదించడం పోలీసులకు పెద్ద పరీక్షే అని చెప్పవచ్చు. కూటమి నేతలు సిఫార్సులను పట్టించుకోకుండా పోలీసు బాధ్యతలను గుర్తు చేసుకుంటూ ముఠా చిట్టా విప్పి..కటకటాల్లోకి నెట్టారు.

కలిసొచ్చిన అవకాశం...

అనారోగ్య సమస్యలు, ఇతర కారణాలుంటే ఓ రెవెన్యూ ఉద్యోగి పేరిట ఆరు నెలలు మరో వ్యక్తి పని చేయడానికి అవకాశం ఉంది. అయితే రెవెన్యూ అధికారులు తండ్రి పేరుతో పనిచేసే వారిని ఏళ్ల తరబడి కొనసాగిస్తున్నారు. వాళ్లను అడ్డం పెట్టుకుని వసూళ్లకు తెరలేపుతున్నారు. వాళ్ల చేతికే లాగిన్లు, రికార్డులు ఇచ్చి పెట్టి రెవెన్యూ సేవలను అమ్మకానికి పెట్టారు. ఇలా రూ.లక్షల్లో డబ్బులిచ్చే వారికి అప్పన్నంగా భూములను కట్టబెట్టేశారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇందుకు ప్రతిఫలంగా కార్లు బహుమతులు తీసుకున్నారనే చర్చ జోరందుకుంటున్నాయి. బెంగళూరు తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి పార్టీలు, పబ్బుల్లో ముంచెత్తేవారని కార్యాలయ సిబ్బంది విమర్శిస్తున్నారు. తనిఖీ చేయాల్సిన ఆర్డీఓ, జేసీలు కూడా పర్యవేక్షణను పూర్తిగా మరిచిపోయారని, గతంలో జేసీగా పనిచేసిన గిరీషా మాత్రం కార్యాలయాన్ని తనిఖీ చేసి వీఆర్వోలు, అధికారులను మందలించారని గుర్తు చేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రెవెన్యూ కార్యాలయంలో ఇంటి దొంగలు రెచ్చిపోయారనే వాదన వినిపిస్తోంది.

ఈ గ్యాంగ్ లీడర్ ఎవరంటే...

2018 ముందు నుంచే తహసీల్దార్ కార్యాలయంలో ఫోర్జరీ వ్యవహారం నడుస్తున్నట్లు ఆరోపణలున్నాయి. చంద్రశేఖర్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న సమయంలో తహసీల్దార్ సీలు విరిగింది. ఆ సీలు దొంగ పత్రాలు సృష్టించే వ్యక్తులే ఎత్తుకెళ్లారని కార్యాలయ సిబ్బంది కోడైకూస్తూ వచ్చింది. అప్పట్లో అధికారులు మాత్రం దీనిని పెద్దగా పట్టించుకోలేదు. ఇన్నాళ్ల తర్వాత ఇంటి దొంగలే ఈపని చేశారనేది పోలీసుల విచారణలో తేలింది. చిత్తూరు మండలంలోని పెరుమాళ్ల కండ్రిగ రెవెన్యూ వీఆర్ఏగా వ్యవహరిస్తున్న మోహన్ ఈ సీలు చోరీ చేసి.. ఇంట్లో దాచి పెట్టి దొంగ పత్రాలకు వాడుకున్నట్లు పోలీసు విచారణలో బయటపడింది. రూ.వేలల్లో డబ్బులు తీసుకుని దొంగ సంతకాలు పెట్టడం, సీలు వేయడం, తప్పుడు పత్రాలతో బ్యాంకు రుణాలు ఇప్పించేందుకు పెద్ద ముఠాను ఏర్పరుచుకున్నాడని ఈకేసులో వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో కీలకంగా వ్యహరించిన మోహన్ మరో వీఆర్ఏగా ఉన్న రాజశేఖర్, డాక్యుమెంట్ రైటర్ గజేంద్రకుమార్ సహకారంతో ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్న గౌతమ్, జాన్సీ సహకారంతో బ్యాంకులను రూ.లక్షల్లో బురిడీ కొట్టించేందుకు ప్రయత్నించారన్న నిజాలు వెల్లడయ్యాయి. కాగా ఈ కేసుకు సంబంధించి మరో ఐదుగురు పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఫోర్జరీపై 'సాక్షి' పట్టు

ఫోర్జరీ పత్రాల సృష్టిపై గత కొన్నేళ్లు సాక్షి దినపత్రికలో పలు వార్తా కథనాలు ప్రచురితమయ్యాయి. ఎవరెవరూ..ఎలా చేస్తున్నారనే విషయాన్ని కళ్లకు కట్టినట్లు చూపించింది.అయితే ఇంటి దొంగల ముసుగులో పడిన అధికారులు తేలికగా తీసుకున్నారు. తహసీల్దార్ కళావతి సంతకం ఒకటి బయటికి రాకపోయి ఉంటే ఈ ఇంటి దొంగల మరింత రెచ్చిపోయి ఉంటారు. ఈ సంతకం ఫోర్జరీ దందాను సాక్షి దినపత్రిక వెలుగులోకి తీసుకొచ్చింది. కూటమి నేతల అడ్డంకులు ఉన్న వెంబడించి వార్తా కథనలు ప్రచురించింది. దీనిపై స్పందించిన తహసీల్దార్ కళావతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఫోర్జరీ దందా బహిర్గతమైంది. ఇంటి దొంగలతో పాటు మరో ముగ్గురు రిమాండ్‌లోకి వెళ్లారు.

పెరుమాళ్లకండ్రిగలో సమస్యలు కుప్పలు తెప్పలు

తండ్రి పేరుతో పెరుమాళ్ల కండ్రిగకు వీఆర్‌ఏగా వ్యవహరిస్తున్న మోహన్ రెవెన్యూ అధికారులను గుప్పట్లో పెట్టుకుని చక్రం తిప్పాడనే ఆరోపణలున్నాయి. సర్వే నంబర్లను మార్చడం, సరిహద్దుల్లో హెచ్చు తగ్గులున్నాయని సమస్యలను సృష్టించి ఆదాయ వనరులు మార్చుకున్నట్లు విమర్శలు వస్తున్నాయి. గ్రామ కంఠం భూములను తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించడం, ప్రభుత్వ భూములను కుటుంబసభ్యులు, బంధువుల పేరుతో పట్టాలిప్పించినట్లే వాదనలు గట్టిగా వినిపిస్తున్నాయి. దీంతో పాటు తిమ్మసముద్రం, ప్రశాంత్‌నగర్, ఇరువారం ప్రాంతాల్లో తప్పుడు పత్రాలు సృష్టించి, పలు స్థలాలకు పట్టాలు ఇచ్చినట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఒక్కో పట్టాకు రూ. లక్ష నుంచి రూ. 3 లక్షల వరకు వసూలు చేసినట్లు కార్యాలయ సిబ్బంది ఆరోపిస్తున్నారు.

స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అక్రమాలపై విచారణ

చిత్తూరు కలెక్టరేట్ : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అక్రమాలపై డీఈఓ కార్యాలయంలో ఆర్‌ఐపీ గురువారం పలువురిని విచారణ జరిపారు. పాఠశాల స్థాయిలో క్రీడాభివృద్ధికి ఏర్పాటు చేసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో అక్రమాలు జరిగాయని పలువురు లిఖిత పూర్వకంగా డీఈఓ వరలక్ష్మికి ఫిర్యాదు చేశారు. డీఈఓ ఈ విషయంపై వైఎస్సార్ కడప జిల్లా ఆర్జేడీకి నివేదికలు పంపారు. ఆ నివేదికల ఆధారంగా పాఠశాల విద్య ఆర్జేడీ అవకతకలపై సమగ్ర విచారణకు ఆర్‌ఐపీ (రీజినల్ ఇన్‌స్పెక్టర్ ఫిజికల్ ఎడ్యుకేషన్) అధికారి భానుమూర్తిరాజును విచారణ అధికారిగా నియమించారు. ఆయన గురువారం డీఈఓ కార్యాలయానికి విచ్చేసి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి వసంతవాణి, చిత్తూరు జిల్లాకు చెందిన ఫిజికల్ డైరెక్టర్లు సిరాజ్, కృష్ణయ్య, రవి, బాబు, తిరుపతికి చెందిన నూర్ మహమ్మద్‌ను సమగ్రంగా విచారణ జరిపారు.

భారీస్థాయిలో అవకతవకలు

ప్రభుత్వం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలకు మంజూరు చేసిన నిధులను పక్కదారి పట్టించారని అభియోగాలు తలెత్తాయి. ఇటీవల జిల్లా వ్యాప్తంగా నిర్వహించి 3 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీల నిర్వహణలో నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి, క్రీడల ముసుగులో ఉన్న పలువురు పీడీలపై 28 ఫిర్యాదులు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. దొంగబిల్లులు పెట్టి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిధులు కాజేశారని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదులపై ఆర్‌ఐపీ భానుమూర్తి రాజు సమగ్రంగా విచారణ నిర్వహించారు. అందిన ప్రతి ఫిర్యాదుపై ప్రశ్నలు వేసి లిఖిత పూర్వకంగా సమాధానాలు రాయించుకున్నారు.

ఆర్జేడీకి నివేదిస్తాం

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి, పలువురు పీడీలపై ఫిర్యాదులందాయి. అందిన ఫిర్యాదులపై సమగ్రంగా విచారణ జరిపాం. ఈ విచారణలో తెలుసుకున్న అంశాలను నివేదికల రూపంలో ఆర్జేడీకి అందజేస్తాం. అనంతరం వారిపై ఆర్జేడీ శాఖాపరంగా చర్యలు తీసుకుంటారు. – భానుమూర్తిరాజు, ఆర్‌ఐపీ, వైఎస్సార్‌కడప జిల్లా

పంటకు రక్ష.. భక్షకులకు శిక్ష



మొక్కజొన్న రక్షణకు రైతు ఏర్పాటు చేసిన ఇనుప రేకులు

పలమనేరు: ప్రతి సమస్యకూ ఓ మార్గం ఉన్నట్టు ఓ రైతు తన మొక్కజొన్న తోటలో పిట్టలు, వానరాలను తరిమేందుకు ఓ వినూత్న ఆలోచన చేశారు. పాత రేకులతో భారీ శబ్ధాలు వచ్చేలా చేసి, నిశ్చింత అయ్యాడు. పలమనేరు నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లి మండలం చీలంపల్లికి చెందిన రైతు జగదీష్ తన పొలంలో మొక్కజొన్న సాగు చేశాడు. ప్రస్తుతం కంకులు ముదిరిన దశలో ఉన్నాయి. దీంతో పక్షులు, వానరాలు తోటలోకి వచ్చి రైతుకు నష్టం కలిగిస్తున్నాయి. దీన్ని గమనించిన కేకలు పెట్టినా అవి వెళ్లకపోవడంతో ఓ పాత ఇనుప రేకును వంచి దానికి ఓ తాడును కట్టాడు. ఇది గాలి వచ్చినప్పుడు రేకులు రాసుకుని శబ్దం వచ్చేలా చేశారు. గాలి లేనప్పుడు రైతు రేకులకు కట్టిన దారాన్ని లాగుతూ శబ్దాన్ని పుట్టిస్తున్నాడు. దీంతో అతని మొక్కజొన్న తోటలోకి ఇప్పుడు పక్షులు, వానరాలు రాకుండా పోయాయి. రైతు ఐడియాను చూసిన జనం వారెవ్వా అంటున్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు



క్షతగాత్రులు

చౌడేపల్లి: చౌడేపల్లె– తిరుపతి ప్రధాన రహదారిలోని ఆంజనేయస్వామి వద్ద ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో గురువారం ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. బెంగళూరుకు చెందిన వేణుగోపాల్ బెంగళూరు నుంచి సదుం మండలం తిమ్మానాయనపల్లెలోని బంధువుల ఇంటికి బయలు దేరాడు. ఇదే మార్గంలో లద్దిగం గ్రామానికి చెందిన రెడ్డెప్ప, షఫీ మరొక బైక్‌లో సదుం నుంచి చౌడేపల్లె వైపునకు వస్తుండగా బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గరికి తీవ్ర గాయాలయ్యాయి. 108కు సమాచారం ఇచ్చినా వాహనం ఆలస్యంగా రావడంతో కడియాల మహేష్‌బాబు ప్రథమి చికిత్స చేయించి వాహనంలోకి ఎక్కించే చర్యలు తీసుకున్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలమనేరులో విజృంభిస్తున్న బ్లేడ్‌బ్యాచ్‌లు

- వైఎస్సార్‌సీపీ బ్యానర్లే వారి టార్గెట్



కోసేసిన వైఎస్సార్‌సీపీ నేతల బ్యానర్లు

పలమనేరు: పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకుల బ్యానర్లను గుర్తుతెలియని బ్లేడ్ బ్యాచ్ రాత్రిపూట కోసేస్తోంది. ఇంతకూ ఎవరు వీటిని కట్ చేస్తున్నారో అర్థం కావడం లేదు. పట్టణంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతల బ్యానర్లున్నప్పటికీ కేవలం వైఎస్సార్‌సీపీ నాయకుల బ్యానర్లనే ఈ బ్యాచ్ టార్గెట్ చేస్తోంది. నాయకుల పుట్టినరోజు, లేదా అభినందనలు ఇలా ఏ బ్యానర్ పట్టణంలో ఏర్పాటు చేసిన తొలిరోజే బ్లేడ్ గాట్లు తప్పడంలేదు. గత కొన్నాళ్లుగా ఈ తంతు పట్టణంలో సాగుతోంది. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ యువనేత క్యాడీ ఎస్ రాజేష్ బ్యానర్లను వీరు టార్గెట్ చేసి మరీ కోసేస్తున్నారు. దీనిపై సీసీ కెమెరాల ద్వారానైనా స్థానిక పోలీసులు ఈ బ్లేడ్‌బ్యాచ్‌ను గుర్తించి, శిక్షించాలని బాధిత నాయకులు కోరుతున్నారు.

2047నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్



తిరుపతి ఐఐటీలో మాట్లాడుతున్న అరవింద్ పనగారియా

ఏర్పేడు(రేణిగుంట): 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారే అవకాశం ఉందని 16వ ఆర్థిక సంఘం చైర్మన్, తొలి నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ డా.అరవింద్ పనగారియా అన్నారు. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీని ఆయన గురువారం సందర్శించారు. 'భారతదేశం గ్లోబల్ ఎకానమీలో తదుపరి దశాబ్దం' అనే అంశంపై ఆయన ఐఐటీ హ్యూమానిటీస్ – సోషల్ సైన్సెస్ విభాగం నిర్వహించిన సమావేశంలో పాల్గొని, ప్రసంగించారు. ఆయనకు ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కెఎన్.సత్యనారాయణ స్వాగతం పలికి, మూడో జనరేషన్ ఐఐటీగా తిరుపతి ఐఐటీ ప్రస్థానం గురించి, పదేళ్లలో ఐఐటీ సాధించిన ప్రగతిని గురించి ఆయనకు వివరించారు. 16వ ఆర్థిక సంఘం సభ్యులు, ఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మనోజ్ పాండా, ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఈ సమావేశంలో పాల్గొని, ప్రసంగించారు. ప్రొఫెసర్ అరవింద్ పనగరియా మాట్లాడుతూ రెండు దశాబ్దాలలో భారత్ ఎన్నో సంక్షోభాలను అధిగమించి 8–9 శాతం వృద్ధి రేటు సాధించినట్టు వెల్లడించారు. అటల్ సేతు, కొత్త పార్లమెంట్ భవనం వంటి ప్రాజెక్టులు దేశ సామర్థ్యాన్ని చూపిస్తున్నాయని అన్నారు. రాబోయే దశాబ్దంలో భారతదేశంలో 9–10 ట్రిలియన్ ఎకానమీగా మారే అవకాశం ఉందని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ తిరుపతి ఐఐటీలో మూడో వంతు మంది విద్యార్థులు పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ఉన్నారని, అధ్యాపకులు 200మందికి పైగా పరిశోధన ప్రాజెక్టులలో పాల్గొంటున్నారని తెలిపారు.

సిండికేట్.. అధరహో!



కంపెనీల మాయాజాలం.. చికెన్ ధరల నిర్ణయంపై ప్రభుత్వానికి అజమాయిషీ లేమి.. ట్రేడర్లు, రిటైలర్లు పలు చోట్ల సిండికేట్.. ప్రాంతం, సీజన్, ఆధారంగా కోడి మాంసం ధరలను కొండెక్కిస్తున్నారు. ఫలితంగా నిన్నమొన్నటి వరకు తక్కువకే దొరికిన చికెన్ నేడు అ'ధర'హో అనిపించి.. అటు పౌల్ట్రీ నిర్వాహకులు.. ఇటు మాంసాహార ప్రియులు ఇక్కట్లు పడుతున్నారు.



కోడి మాంసం ధరలు కొండెక్కిస్తున్న కంపెనీలు

- అదును చూసి ధరలను పెంపు
- పౌల్ట్రీ నిర్వాహకులకు నష్టాలు, కంపెనీలకు లాభాలు
- ప్రాంతం ఆధారంగా రేట్ల నిర్ణయం

పలమనేరు: చికెన్ కంపెనీల సిండికేట్ కోడి మాంసం ధరలను ఎప్పటికప్పుడు నిర్ణయిస్తోంది. ప్రాంతం, సీజన్ ఆధారంగా చికెన్ ధరలు భారీగా పెరగడమన్న విషయం గతే ఏడాదిగా జిల్లాలో సాగుతోంది. పెరుగుతున్న ధరలపై సామాన్యుడు ప్రశ్నిస్తే మా చేతుల్లో ఏమీలేదు, అంతా సిండికేట్ మహిమ అంటున్నారు చికెన్ వ్యాపారులు. గట్టిగా మాట్లాడితే ఇవే నేటి చికెన్ ధరలంటూ ఓ దినపత్రికను చూపుతున్నారు. దీంతో సామాన్యులపై ధరా భారం తప్పడం లేదు. మొన్నటి వరకు కారు చౌకగా ఉన్న చికెన్ ధరలు ఉన్నట్టుండి పెరిగాయి. చికెన ధరల నియంత్రణపై ప్రభుత్వానికి సైతం అజమాయిషీ లేకపోవడంతో చికెన్ కంపెనీల సిండికేట్ ఆడిందే ఆట, పాడిందే పాటగా మారింది.

ఆ నాలుగు కంపెనీల గుప్పెట్లోనే ధరలు

జిల్లాలోని బ్రాయిలర్ రైతులకు ప్రధానంగా తమిళనాడులోని ఈరోడ్‌కు చెందిన సుగుణ, ముంబయికి చెందిన ప్రీమియం, పూణెకు చెందిన వీహెచ్‌ఎల్, చిత్తూరుకు చెందిన శ్రీబాలాజీ హ్యాచరీస్ కంపెనీలు చిక్స్(కోడిపిల్లలు)ను పంపిణీ చేసి, 45 రోజుల తరువాత వాటిని రైతుల నుంచి కొంటున్నాయి. ఆ కంపెనీలు రైతులకు కిలో లెక్కల తక్కువ ధరలు చెల్లించి, ఆపై సిండికేట్ ద్వారా ఎక్కువ ధరలకు ప్రజలకు విక్రయిస్తున్నారనే విమర్శలున్నాయి. రైతులు హోల్‌సేల్ ట్రేడర్లకు మాత్రమే కోళ్లను విక్రయించేలా ఆ కంపెనీలు నిర్ణయిస్తాయి. వారు మళ్లీ రిటైల్ వ్యాపారులకు కోళ్లను విక్రయిస్తారు. స్థానికంగా రిటైల్ వ్యాపారులు కూడా సిండికేట్‌గా మారి ధరలను నిర్ణయిస్తున్నారు. దీంతో కోడి ధర కొండెక్కుతోంది. సాధారణంగా కోడిగుడ్ల ధరలను నెక్ (నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ) నిర్ణయిస్తుంది. కానీ చికెన్ ధరలను మాత్రం చిత్తూరు, తిరుపతి చికెన్ ట్రేడర్స్ అసోసియేషన్ డిసైడ్ చేయడం కొసమెరుపు.

సీజన్, ప్రాంతం ఆధారంగా ధరల్లో హెచ్చు తగ్గులు

శ్రావణమాసం, పెరటాసి నెల, శ్రీరామనవమి ఉత్సవాల సమయంలో ప్రజలు చికెన్ తినరు. ఈ నేపథ్యంలో ఆ సమయాల్లో ధరలు తగ్గించడం, సంక్రాంతి, దీపావళి, ఉగాది, వేసవి సీజన్‌లో ధరలను పెంచడమంతా సిండికేట్ చేతుల్లో సాగుతోందనే మాట వినిపిస్తోంది. వీరు డిమాండ్, సీజన్ ఆధారంగానూ, ఆయా ప్రాంతాల వారీగా ధరలను పెంచుతున్నారు. సాధారణంగా రాష్ట్రంలో చికెన్‌ను ఉత్పత్తి చేసే జిల్లాల్లో చిత్తూరు పేరు గాంచింది. ఇక్కడ నుంచి చికెన్ ఎక్కువగా బయటి ప్రాంతాలకు ఎగుమతి అవుతోంది. జిల్లాలో చికెన్ డ్రెసింగ్ కంపెనీల నుంచి విదేశాలకు సైతం ఎగుమతి జరుగుతోంది. అలాంటిది చికెన్ ఉత్పత్తి చేసే జిల్లాలోనే చికెన్ ధరలు ఎక్కువగా ఉండడం ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది.

జిల్లా సమాచారం

జిల్లాలో ఇంటిగ్రేటెడ్ బ్రాయిలర్ రైతులు **32** వేల మంది

ప్రైవేటు హేచరీలు **12**

ఇంటిగ్రేటెడ్ బ్రాయిలర్ పెంపకం ఎక్కువగా సాగే ప్రాంతాలు: పలమనేరు, కుప్పం, పుంగనూరు, పూతలపట్టు, మదనపల్లి నియోజకవర్గాలు

గత నాలుగు నెలల్లో చికెన్ ధరలిలా..

నెల	కిలో చికెన్ ధర(రూపాయిల్లో)
జనవరి	170
ఫిబ్రవరి	190
మార్చి	200
ఏప్రిల్	225

నాక్ ధరలు తక్కువ, ట్రేడర్స్ ధరలు ఎక్కువ

రకం	నాక్ ధర	ట్రేడర్స్ ధర
ఫామ్ వద్ద లైవ్‌బర్డ్	రూ.95	రూ.108
రిటైల్ లైవ్‌బర్డ్	రూ.117	రూ.103
డ్రెస్సెడ్ స్కిన్	రూ.170	రూ.200
స్కిన్‌లెస్	రూ.193	రూ.225

ఇంటిగ్రేటెడ్ కంపెనీల చేతుల్లోనే చికెన్ ధరలు



ఇంట్రిగ్రేటెడ్ కంపెనీలు నిర్ణయించిన ధరలకు రైతులు వారికి కోళ్లను అమ్మాలి. ఆపై వారి హోల్‌సేల్ వ్యాపారులకు కోళ్లను విక్రయిస్తారు. అప్పుడున్న డిమాండ్, సప్లయ్‌ను బట్టి ధరను వారు డిసైడ్ చేస్తారు. హోల్‌సేల్ వ్యాపారులు ట్రాన్స్‌పోర్ట్ చార్జీలను కలిపి రీటైల్ వారికిస్తే వారుసైతం సిండికేట్‌గా ఆయా ప్రాంతంలో ఒకే ధర ఉండేలా చూసుకుంటారు. దీంతో వారు చెప్పిన ధరతో చికెన్ కొనాల్సిందే. – విశ్వనాథ రెడ్డి, పౌల్ట్రీ రైతు, నక్కపల్లి

ఇంటిగ్రేటెడ్ కంపెనీలు ధరలను నిర్ణయిస్తుంటాయి



జిల్లాలో ఐదుదాకా ఇంటిగ్రేటెడ్ చికెన్ కంపెనీలున్నాయి. వారే రైతులకు చిక్స్‌ను ఇచ్చి పెంచాక కొంటున్నారు. రైతులకు పెంచిన కూలి మాత్రమే దక్కేది. బ్రాయిలర్ కోళ్ల అమ్మకాలు కంపెనీల చేతిల్లో ఉంటాయి. వారి నుంచి హోల్‌సేల్ ట్రేడర్లు మళ్లీ రిటైల్‌గా చికెన్ వ్యాపారులకు చేరుతాయి. దీంతో డిమాండ్ ఆధారంగా ఆయా కంపెనీలు ధరలను నిర్ణయిస్తుంటాయి. – గాలి సుబ్రమణ్యం నాయుడు, నెక్ మాజీ సభ్యులు, పలమనేరు